# సాక్షి మెదక్

బుధవారం ౹ 12 ౹ జూలై ౹ 2023




## రైతుల ఖాతాలు ఫ్రీజ్

పంట రుణాలు రెన్యూవల్ చేసుకోవడం లేదని బ్యాంకర్లు రైతుల ఖాతాలను ఫ్రీజ్ చేశారు. దీంతో రైతు బంధు, ఆసరా పెన్షన్లు తీసుకోలేకపోతున్నారు. 8లో



## బన్నీ సేఫ్

బాసర ట్రిపుల్ఐటీ విద్యార్థి అదృశ్యం కథ సుఖాంతమైంది. విద్యార్థి నాందెడ్‌లో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు, కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకువచ్చారు. 8లో



## దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: ఇన్‌స్పైర్ మనాక్ పోటీలకు జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి ఉత్తమమైన ప్రాజెక్టు నమూనాలను ఆగస్టు 31 లోగా పంపించాలని డీఈఓ రాధాకిషన్ తెలిపారు. దీనిపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 15న కలెక్టరేట్‌లో కార్యక్రమం నిర్వహిస్తామని, ఆయా పాఠశాలల నుంచి ఓ ఉపాధ్యాయుడిని కార్యక్రమానికి పంపించాలన్నారు. వివరాలకు 83285 99157 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

# లక్ష్యం రూ.2,795 కోట్లు

- ఖరారైన జిల్లా రుణప్రణాళిక
- గతేడాది కంటే రూ.363కోట్లు అధికం
- నేడు కలెక్టర్ సమక్షంలో ప్రకటన



మెదక్ డీసీసీబీ బ్యాంకు

మెదక్‌జోన్: వ్యవసాయ రంగ, అనుబంధ అభివృద్ధి ఉపాధి కల్పనకు ప్రభుత్వం వార్షిక రుణ ప్రణాళికను నేడు (బుధవారం) విడుదల చేయనుంది. 2023–24 సంవత్సరానికి సంబంధించి రూ.2,795 కోట్లు అందించేలా దీనిని తయారు చేశారు. పంట రుణాలతో పాటు లాంగ్‌టర్మ్, ఇతర అనుబంధ రుణాలను ఇందులో కేటాయించనున్నారు. ఏటా రుణాలను జూన్ మొదటి వారంలోనే ప్రకటించాల్సి ఉండగా, ప్రస్తుతం నెలరోజుల ఆలస్యంగా ప్రవేశ పెడుతున్నారు. మెదక్ జిల్లా వ్యవసాయ ఆధారితం కావటంతో వ్యవసాయేతర అవసరాలకు కూడా ఈ రుణాలు అందించనున్నారు.

**పూర్తికాని టార్గెట్**

- అధికారుల లెక్కల ప్రకారం సుమారు 5 లక్షల ఎకరాల వ్యవసాయ భూములు ఉండగా, వీటిలో సుమారు 4 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి.
- 2022–23లో జిల్లా రుణప్రణాళిక టార్గెట్ రూ.2,432 కోట్లు కాగా ఇచ్చింది మాత్రం కేవలం రూ.1,977కోట్లు. అంటే 81శాతం మాత్రమే పూర్తిచేశారు.
- సాగు పెట్టుబడి వ్యయం పెరుగుతుండటంతో ఏటా రైతులకు అందించే రుణంలో 10 శాతం పెంచుతున్నారు.
- గతేడాది క్రాప్‌లోన్‌తో పాటు ఇతర లాంగ్‌టర్మ్ రుణాలు, వ్యవసాయ అనుబంధ రుణాలు మొత్తం రూ.2,432 కోట్లుగా ఉండగా, ఈ ఏడాది రూ.2,795 కోట్లకు పెంచారు.
- ఏటా వ్యవసాయ రుణ ప్రణాళికను ప్రవేశపెడుతున్న అధికారులు వాటిని రైతులకు పంపిణీ చేయటంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి.
- కేటాయించిన వాటిలో టార్గెట్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయడంలేదు.

**పెరిగిన రైతుల సంఖ్య**

- జిల్లాలో గతేడాది 2.26 లక్షల మంది రైతులు ఉండగా, ఈ ఏడాది 2వేల మంది పెరిగారు.
- ఈ ఏడాది కొత్తగా 610 మంది రైతులకు పోడు పట్టాలు ఇవ్వడంతోపాటు, భూప్రక్షాళనలో భాగంగా సమస్యలున్న భూములను ప్రభుత్వం పార్ట్(బి)లో పొందు పర్చింది.
- సమస్యలు పరిష్కారమైన భూములను ధరణిలో చేర్చడంతో రైతుల సంఖ్య పెరిగింది.
- ఈ ఏడాది ఎకరాకు వరి, పత్తి పంటలకు రూ.42 వేల నుంచి రూ.45 వరకు పెంచినట్లు అధికారులు తెలిపారు .
- విత్తనాలు పండిస్తే ఎకరాకు రూ.1.30 లక్షల నుంచి రూ.1.50 లక్షల వరకు రుణాలు అందిస్తారు.
- సంబంధిత విత్తన సీడ్ కంపెనీ యజమాని ధ్రువీకరిస్తే అంతే పెద్ద మొత్తంలో రుణం ఇచ్చేందుకు బ్యాంకు అధికారులు సిద్ధంగా ఉన్నారు.

### రుణాలు సక్రమంగా చెల్లించాలి



రైతులు తీసుకున్న పంట రుణాలు రెన్యూవల్ చేసుకోవడంతో పాటు క్రమం తప్పకుండా చెల్లిస్తే 4 శాతం వడ్డీని తిరిగి రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమకడుతుంది. అంటే రైతు కేవలం 3శాతం వడ్డీని మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. ఏడాదిలో రుణం చెల్లించకుంటే వడ్డీ అధికం అవుతుంది. ప్రభుత్వం మాఫీ చేసినప్పుడు రైతులకు దీనిని ఇస్తాం. రెన్యూవల్ చేసుకుంటే రుణమాఫీ కాదనే భావన సరికాదు.

– మూర్తి, లీడ్‌బ్యాంకు మేనేజర్, మెదక్



ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్లు రమేశ్, ప్రతిమాసింగ్

# ఓటింగ్ యంత్రాలపై అవగాహన అవసరం

**అదనపు కలెక్టర్ రమేశ్**

మెదక్ కలెక్టరేట్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వీవీ ప్యాట్స్‌పై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్లు రమేశ్, ప్రతిమాసింగ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల అవగాహన కేంద్రాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వీవీ ప్యాట్స్‌పై ప్రజలకు, ఆయా పార్టీల నాయకులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మెదక్, నర్సాపూర్ నియోజకవర్గ కేంద్రాల్లో ఆర్డీఓ కార్యాలయంలో కూడా ఈ కేంద్రాలు ఏర్పాటు చేశామని, సంచార ప్రదర్శన వాహనాల ద్వారా కూడా అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఓటర్లందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి రాజిరెడ్డి, కలెక్టరేట్ ఏఓ యునస్, ఎలక్షన్ సూపరింటెండెంట్ హరిదీప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతలకు సహకరించాలి

**ఎస్పీ రోహిణి ప్రియదర్శిని**



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

నర్సాపూర్: జిల్లాలో శాంతి భద్రతలకు ప్రజలు సహకరించాలని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని అన్నారు. మంగళవారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతీ పిటిషన్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, పెట్రోలింగ్ పెంచి, 100 నంబర్‌కు వచ్చే కాల్స్‌పై తక్షణం స్పందించాలన్నారు. పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరంచి, పాత నేరస్తులపై నిఘా పెట్టాలన్నారు. ఎన్నికల సమయంలో నేరాలకు పాల్పడే వారి పట్ల ప్రత్యేక దృష్టి పెడుతామని ఆమె అన్నారు. ప్రశాంతంగా ఓటు వేసేందుకు అనువైన వాతావరణం కల్పిస్తామని, గతంలో ఎన్నికల సమయంలో జరిగిన ఘటనలపై దృష్టి సారిస్తామన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. నేరం జరిగితే నిందితులను పట్టుకునేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు స్పీడ్ గన్స్ ఏర్పాటు, డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్నామని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, బైకర్స్ హెల్మెట్ ధరించాలన్నారు. సీఐ షేక్‌లాల్ మధార్, ఎస్ఐ శివకుమార్ ఉన్నారు.

# రాహుల్‌పై అనర్హత వేటు మోదీ కుట్రే

**పీసీసీ అధికార ప్రతినిధి మ్యాడం బాలకృష్ణ**

మెదక్‌జోన్: మోదీ ఫాసిస్టు విధానాల కుట్రలో భాగంగానే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై పార్లమెంట్‌లో అనర్హత వేటు వేశారని టీకాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి మ్యాడం బాలకృష్ణ ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాహుల్ గాంధీపై బీజేపీ కుట్రపూరితంగా నిందలు వేసిందన్నారు. పెట్టుబడి వర్గాలకు కొమ్ముకాస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలపై ప్రశ్నించినందుకే రాహుల్‌పై కక్షపూరిత చర్యలకు పాల్పడుతున్నారన్నారు. అదానికి, అంబానీలకు వేలాది కోట్లను కట్టబెడుతూ ప్రజలపై భారం మోపుతుందని విమర్శించారు. మోదీ విధానాలకు వ్యతిరేకంగా బుధవారం హైదరాబాదు గాంధీ భవన్‌లో పీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించే మౌన దీక్షకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీసీసీ నేత చౌదరి సుప్రభాత్‌రావు, హఫీజొద్దిన్, చిన్నశంకరంపేట, పాపన్నపేట, మెదక్, రామాయంపేట మండలాల ప్రజాప్రతినిధులు సత్యనారాయణ గౌడ్, షేర్ పల్లి ఎంపీటీసీ స్వామి, ఎంపీటీసీ ప్రసాద్, అధ్యక్షుడు మల్లేష్, శకరంపేట్ మండల సోషల్ మీడియా కో ఆర్డినేటర్ నవీన్ మాలే, నాయకులు భూమన్న, అక్బర్, నాగిరెడ్డి, అల్లాడి వెంకటేష్, స్వామి, శివకుమార్, కౌన్సిలర్ లింగం, దేవి ప్రసాద్, సంజీవ్ ఉన్నారు.



మాట్లాడుతున్న మ్యాడం బాలకృష్ణ

# నులిపురుగుల నివారణకు కృషి చేయాలి




మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌ప్రతిమాసింగ్

**అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్**

మెదక్ కలెక్టరేట్: నులిపురుగుల నివారణే లక్ష్యంగా అధికారులు పని చేయాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా డిస్ట్రిక్ టాస్క్ ఫోర్స్ సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 20న జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమం సందర్భంగా జిల్లాలో 1 నుంచి 19 ఏళ్ల వయసు పిల్లలు 2.36 లక్షల మందికి ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని ఆదేశించారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, జూనియర్ కళాశాలు, మదర్సాలో ఈ మాత్రలను అందుబాటులో ఉంచుతామన్నారు. ఒకటి నుంచి రెండేళ్ల పిల్లలకు సగం మాత్ర, 2 నుంచి 19ఏళ్ల పిల్లలకు ఒక మాత్ర ఆహారం తీసుకున్న తర్వాత వేయాలన్నారు. దోమల వల్ల వచ్చే వ్యాధులు మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్ గన్యా రాకుండా దోమల నియంత్రణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

**డ్రై డే పాటించాలి**

ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించేలా అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. ఇంటి పరిసరాల్లో కొబ్బరి చిప్పలు, కూలర్లు, రోళ్ల మొదలగు వాటిలో నీరు నిలువకుండా చూసుకోవాలన్నారు. చలి జ్వరం, నొప్పులు ఉంటే దగ్గర్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ చందు నాయక్, ప్రోగ్రాం ఆఫీసర్ మాధురి, డీఎల్‌పీఓ, ఉప జిల్లా వైద్యాధికారులు డాక్టర్ విజయనిర్మల, డాక్టర్ అనిలా, డాక్టర్ అరుణశ్రీ,డీఎస్ఓ నవీన్, సహాయ మలేరియా అధికారులు విజయేందర్, కుమారస్వామి, నర్సాపూర్, మెదక్, తూప్రాన్, రామాయంపేట మున్సిపల్ కమిషనర్లు, విద్యాశాఖ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### ఆర్టీసీ ఫోన్ ఇన్‌కు స్పందన



మాట్లాడుతున్న డీఎం రవిచందర్

మెదక్‌జోన్: ఆర్టీసీ అధికారులు మంగళవారం ఏర్పాటు చేసిన డయల్ యువర్ కార్యక్రమానికి స్పందన లభించిందని ఆర్టీసీ డీఎం రవి చందర్ తెలిపారు. బొడ్మట్‌పల్లి నుంచి అల్లాదుర్ బస్ సౌకర్యం కల్పించాలని అల్లాదుర్గం గ్రామానికి చెందిన శ్రీశైల్ కోరగా.. రూట్‌ను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. జేబీఎస్ నుంచి జగద్గిరిగుట్ట వరకు, ఆది, మంగళవారాల్లో ఏడుపాయల, మెదక్ చర్చి వరకు బస్సులను నడపాలని జగద్గిరిగుట్టకు చెందిన ఈశ్వర్ కోరగా, మెదక్– జేబీఎస్‌కు ప్రతీ 15 నిమిషాలకో బస్సు ఉందని, ఏడుపాయల, మెదక్ బస్సుగురించి ఆలోచిస్తామన్నారు. మెదక్–బొడ్మట్‌పల్లి నుంచి అల్లాదుర్గం వరకు బస్సు నడపాలని టేక్మాల్ మండలం చిల్వెర గ్రామానికి చెందిన రవి, రేగోడ్ నుంచి అల్లాదుర్గం వరకు నైట్ సర్వీస్ నడిపించాలని ఎండీ సర్దార్ కోరగా.. రూట్లను పరిశీలిస్తామని డీఎం సమాధానం ఇచ్చారు. కార్గోలో వచ్చిన వస్తువులను ఆలస్యంగా అందిస్తున్నారని, సకాలంలో అందించేలా చూడాలని మెదక్ చెందిన ఇక్బాల్ కోరగా, సిబ్బందిని అలర్ట్ చేస్తామని డీఎం తెలిపారు.

# విద్యుత్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలి



డీఈ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

తూప్రాన్: విద్యుత్ శాఖలో పని చేస్తున్న ఉద్యోగులందరికీ ప్రతీ నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఏ.మహేందర్ రెడ్డి, యూనియన్ కార్యదర్శి గూడాల రవీంద్ర ప్రసాద్ కోరారు. మంగళవారం తూప్రాన్ విద్యుత్ డీఈ కార్యాలయం ఎదుట ఉద్యోగులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం డిమాండ్లు పరిష్కారించాలని డీఈ రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ వారు మాట్లాడుతూ.. ఉద్యోగులకు సమయానికి వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. క్రమం తప్పకుండా 1న వేతనాలు వచ్చేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఆ యూనియన్ అధ్యక్షుడు నర్సింహులు, రాజునాయక్, సలీమ్‌పాషా, హనుమంతు, బిక్షపతి, అశోక్, సిద్ది రాములు, నవణీత పాల్గొన్నారు.

### సీఎంని కలిసిన సునీతారెడ్డి



సీఎం కేసీఆర్‌కు పూలమొక్క అందజేస్తున్న సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్: సీఎం కేసీఆర్‌ను రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి మంగళవారం సాయంత్రం సచివాలయంలో కలిశారు. సీఎం కేసీఆర్‌కు పూల మొక్క అందించారు. కుటుంబసభ్యులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు.

### వృద్ధాశ్రమం ఏర్పాటు చేయాలి

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని వృద్ధులకు ప్రత్యేకంగా రెండెకరాల స్థలంలో వృద్ధాశ్రమం ఏర్పాటు చేయాలని స్వచ్ఛభారత్ స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షుడు బాల్‌రాజ్ కోరారు. మంగళవారం అదనపు కలెక్టర్ రమేశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుటుంబసభ్యులను కోల్పోయిన అనాథలుగా మారుతున్న వారిని ఆశ్రమంలో చేర్పించేందుకు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆశ్రమం ఏర్పాటు చేయాలన్నారు. ఆయనతో సభ్యులు ప్రవీణ్, ప్రభాకర్, గోపాల్ నాయక్, జగదీష్, రాములు, చంద్రశేఖర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని పట్టించుకోని నాయకులు



మాట్లాడుతున్న గోపి, నాయకులు

నర్సాపూర్: నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు అభివృద్ధిని పట్టించుకోకుండా రియల్ వ్యాపారాలకే పరిమితమయ్యారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయిపల్లిగోపి విమర్శించారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. అధికార పార్టీ నాయకులు ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నట్లు ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. నియోజకవర్గానికి చెందిన ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి తండ్రి నర్సాపూర్‌లో వెంచర్ ఏర్పాటు చేస్తున్నారని, హెచ్ఎండీఏలో అనుమతులు ఇప్పించేందుకు ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సహకరిస్తున్నట్లు ఆరోపించారు. పోడు పట్టాల పంపిణీలో బీఆర్ఎస్ నాయకులకు అనుకూల వ్యక్తులకే ప్రాధాన్యం ఇచ్చారని, నిజమైన అర్హులను పట్టించుకోలేదని అన్నారు. అభివృద్ధిలో నర్సాపూర్ వెనుకబడిందని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మల్లేష్‌గౌడ్, జిల్లా కార్యదర్శి సురేష్, నాయకుడు రఘువీరారెడ్డి అన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థలో ఉన్నాయని, స్టేడియం, పీజీ కాలేజీకి భవనాలు లేవని అన్నారు. సమావేశంలో నాయకులు రవిగౌడ్, ఆంజనేయులుగౌడ్, ప్రేంకుమార్, వెంకట్‌రెడ్డి, నాగరాజు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో కమిటీల కిరికిరి..

- మండల, పట్టణ అధ్యక్షుల నియామకంపై రచ్చ



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: గ్రూపు విభేదాలు, అంతర్గత కుమ్ములాటలతో నిత్యం వార్తలతో ఉండే కాంగ్రెస్ పార్టీలో ఇప్పుడు కమిటీల కిరికిరి కొనసాగుతోంది. ఆ పార్టీ మండల, పట్టణ అధ్యక్షుల నియామకంపై తారాస్థాయిలో రచ్చ జరుగుతోంది. పలు మండల, పట్టణ కమిటీలను ఏకపక్షంగా ప్రకటించారంటూ హైదరాబాద్‌లోని గాంధీభవన్‌ను ముట్టడించగా, ఏకంగా పరస్పరం దాడులకు దిగు తున్న ఘటనలు కూడా వెలుగు చూస్తున్నాయి. కాంగ్రెస్‌లో ఆయా నియోజకవర్గాల్లోని ముఖ్యనేతల మ ధ్య ఉన్న విభేదాలు ఇప్పటి వరకు జిల్లా స్థాయిలోనే బట్టబయలు కాగా, ఇప్పుడు గాంధీభవన్ స్థాయిలో రచ్చ జరగడం చర్చనీయాంశంగా మారింది.

**మెదక్ కమిటీలు నియామకం ఏకపక్షమంటూ..**

మెదక్ నియోజకవర్గంలోని, మండల, పట్టణ అధ్యక్ష పదవుల నియామకం రచ్చకు దారితీసింది. ఈ కమిటీలను ఏకపక్షంగా నియమించారని ఆరోపిస్తూ టీపీసీసీ సభ్యుడు సుప్రభాత్‌రావు వర్గం ఏకంగా గాంధీభవన్‌ను ముట్టడించింది. కంఠారెడ్డి తిరుపతిరెడ్డిని డీసీసీ అధ్యక్ష పదవి నుంచి తొలగించాలనే డిమాండ్ తెరపైకి తెచ్చారు. ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌ను అమలు చేయాలని పీసీసీ నేత మ్యాడం బాలకృష్ణ వర్గం పార్టీ రాష్ట్ర నాయకత్వానికి ఫిర్యాదు చేశారు.

**‘ఆవుల’కు టీపీసీసీ షోకాజ్ నోటీసులు?**

నర్సాపూర్ నియోజకవర్గంలోని వెల్దుర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షుడి నియామకం విషయంలో ఏకంగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్‌పై దాడి జరగ్గా, ఆలస్యంగా వెలుగు చూసింది. టీపీసీసీ జనరల్ సెక్రెటరీ ఆవుల రాజిరెడ్డి వర్గానికి చెందిన నాయకులు పార్టీ చీఫ్ రేవంత్‌రెడ్డి నివాసం వద్ద గాలిపై దాడి చేయడం చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ సీరియస్‌గా తీసుకుంది. ఇందుకు బాధ్యులైన వెల్దుర్తి మండల పార్టీ మాజీ అధ్యక్షుడితో పాటు, మరో ముగ్గురుపై సస్పెన్షన్ వేటు వేసింది. ఈ ఘటనలో రాజిరెడ్డికి క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు సమాచారం.

**తెల్లాపూర్ కమిటీ విషయంలో కాటాకు షాక్..**

సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ పట్టణ అధ్యక్ష పదవి విషయంలోనూ వివాదం రాజుకుంది. ఈ కమిటీ విషయంలో నియోజకవర్గ ముఖ్య నాయకుడు కాటా శ్రీనివాస్‌గౌడ్ షాక్ తగిలింది. ముందుగా కాటా శ్రీనివాస్‌గౌడ్ అనుచరుడు రవీందర్‌ను తెల్లాపూర్ పట్టణ అధ్యక్షుడిగా నియమించినట్లు ప్రకటించారు. కానీ ఈ పదవికి చిలుకమర్రి ప్రభాకర్‌రెడ్డిని నియమిస్తున్నట్లు టీపీసీసీ నుంచి ఉత్తర్వులు రావడం పార్టీ వర్గాల్లో రచ్చకు దారితీసింది.

## న్యూస్‌రీల్

### ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన విద్యార్థుల సంఖ్య

**డీఈఓ రాధాకిషన్**



రికార్డులను పరిశీలిస్తున్న డీఈఓ రాధాకిషన్

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన, మౌలిక వసతుల కల్పనతో జిల్లాలో 80 శాతం విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారని డీఈఓ రాధాకిషన్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, దొంతి, బిజ్లిపూర్ పాఠశాలలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫామ్ ఉచితంగా అందించడంతో పాటు వివిధ పాఠశాలలకు 170 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆదేశాలను పట్టించుకొని సిబ్బందిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, ఈ నెల 15 వరకు గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పఠనోత్సవం నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ బుచ్చనాయక్, హెచ్ఎం రమేష్ తదితరులు ఉన్నారు.

### అవగాహనకు సంచార వాహనం



వాహనాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌డీఓ శ్రీనివాసులు, అధికారులు

నర్సాపూర్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం(ఈవీఎం), వీవీ ప్యాట్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌డీఓ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం నియోజకవర్గానికి కేటాయించిన సంచార ప్రదర్శన వాహనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ వాహనంలో ఈవీఎం, వీవీ ప్యాట్స్ మోడల్స్ ఉంటాయని, నియోజకవర్గంలోని తొమ్మిది మండలాల్లో ప్రతీ పోలింగ్ స్టేషన్ పరిధిలో ప్రజలకు దీని ద్వారా అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆర్డీఓ కార్యాలయంలో కూడా ఓ ఈవీఎం, వీవీ ప్యాట్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ ఫైజల్, సిద్దిరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఆధునిక విధానం అలవర్చుకోవాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

శివ్వంపేట(నర్సాపూర్): రైతులు సాగులో ఆధునిక పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి పొందవచ్చని నర్సాపూర్ వ్యవసాయ సంచాలకులు సురేఖ అన్నారు. మంగళవారం మండలంలోని గోమారంలో యంత్రంతో వరి నాటు వేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ యంత్రంతో తక్కువ ఖర్చు, సమయంలో నాటు పూర్తి చేయొచ్చని, ఎకరానికి రూ.6వేల నుంచి రూ.8 వేలు ఆదాతో పాటు, కూలీల కొరతను అధిగమించవచ్చన్నారు. ఈ విధానంతో మొక్కలకు బాగా గాలి, వెలుతురు అందడంతో పాటు ఎరువులు చల్లడానికి, గడ్డి కలుపు తీసేందుకు అనువుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఓ లావణ్య, ఏఈఓ మజీద్ అలీ, మహీంద్రా డీలర్ హన్మంత్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

### నియామకం



సాయికుమార్‌ను అభినందిస్తున్న సుమన్

మనోహరాబాద్(తూప్రాన్): కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా (కాయ్) తెలంగాణ రాష్ట్ర నూతన కమిటీలో క్యాషియర్‌గా మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం జీడిపల్లికి చెందిన సాయికుమార్ ఎన్నికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కమిటీతో కలిసి మంగళవారం రాష్ట్ర చీఫ్ అడ్వైజర్ డా.సుమన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తనపై నమ్మకముంచి రాష్ట్ర కమిటీలో స్థానం కల్పించిన కృతజ్ఞతలు తెలిపారు.

## క్లుప్తంగా

### సైబర్ మోసగాళ్లతో జాగ్రత్తగా ఉండాలి

ఎస్‌ఐ సందీప్‌రెడ్డి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సందీప్‌రెడ్డి

మనోహరాబాద్(తూప్రాన్): ప్రతీ ఒక్కరు సైబర్ మోసగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని మనోహరాబాద్ ఎస్‌ఐ సందీప్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మనోహరాబాద్ మండలం కాళ్లకల్ పరిశ్రమ వాడలో పలువురికి సైబర్ మోసాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమత మఫోన్లలో లింకులు ఒపెన్ చేసినా, ఓటీపీలను గుర్తుతెలియని వ్యక్తులకు చెప్పినా మోసపోయి నట్లేనన్నారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే యజమానిపై, నడిపిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతీ ఒక్కరు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు.

### డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

**పటాన్‌చెరు టౌన్:** డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 17 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా జడ్జి 15 మందికి ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున, మరో ఇద్దరికీ మూడు వేల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

### రేషన్ బియ్యం స్వాధీనం



ట్రాలీ ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యం


**చేర్యాల(సిద్దిపేట):** అక్రమంగా రవాణా చేస్తున్న రేషన్ బియ్యాన్ని మంగళవారం రెవెన్యూ అధికారులు పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..ట్రాలీ ఆటోలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సిబ్బంది వెళ్లి ట్రాలీ ఆటోలో చూశారు. అందులో 9 సంచుల రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించి వెంటనే ఆటోతో పాటు బియ్యాన్ని స్వాధీనం చేసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

### గంజాయి పట్టివేత

పోలీసుల అదుపులో నలుగురు

**పటాన్‌చెరు టౌన్:** అక్రమంగా తరలిస్తున్న 80 కిలోల గంజాయిని పట్టుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసు కథనం ప్రకారం..ఏపీలోని చింతపల్లి ఏజెన్సీ ప్రాంతం నుంచి పటాన్‌చెరు మీదగా నారాయణఖేడ్‌కు అక్రమంగా గంజాయి తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారం రాగా, పోలీసులు పటాన్‌చెరు మండలం ముత్తంగి రింగ్ రోడ్డు వద్ద మంగళవారం రాత్రి పట్టుకున్నారు. కారులో నాలుగు బ్యాగుల్లో తరలిస్తున్న 80 కిలోల గంజాయిని పట్టుకొని, నలుగురిని అదుపులోకి తీసుకొని పూర్తిస్థాయిలో పోలీసులు విచారణ చేపడుతున్నారు.

### భవనంపై నుంచి పడి మేస్త్రీ మృతి



**నారాయణఖేడ్:** నారాయణఖేడ్ పట్టణంలో నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి ప్రమాదవశాత్తు కిందపడి మేస్త్రీ మృతి చెందాడు. ఎస్‌ఐ ఏడుకొండలు తెలిపిన వివరాల ప్రకారం..హన్మంత్‌రావుపేట్‌కు చెందిన లక్ష్మణ్(37) పట్టణంలో ఓ భవనం పైభాగంలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడిపోయి అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు పిల్లలు ఉన్నారన్నారు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు.

### ట్రైడెంట్ చక్కెర కర్మాగారాన్ని విక్రయించొద్దు

**జహీరాబాద్:** జహీరాబాద్‌లోని ట్రైడెంట్ చక్కెర కర్మాగారాన్ని విక్రయించవద్దని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం కర్మాగారం కార్మికులు, పలువురు రైతులు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డిని కలిసి చర్చించారు. భవిష్యత్ కార్యాచరణ చేపట్టేందుకు ఈ నెల 12వ తేదీన జహీరాబాద్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు నర్సింహారెడ్డి పేర్కొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**జహీరాబాద్:** జహీరాబాద్‌లోని అల్లాన వద్ద గల పాత 33కేవీ సబ్‌స్టేషన్ వద్ద మరమ్మతులు చేపడుతున్న కారణంగా పలు ప్రాంతాల్లో ఈ నెల 12వ తేదీన విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ మధుసూదన్ తెలిపారు. ఉదయం 10నుంచి సాయంత్రం 6గంటల వరకు కొత్తూర్(బీ), దిడిగి, అల్గోల్, రంజోల్ గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

# రైతుల ఖాతాలు ఫ్రీజ్..

- లోన్ రెన్యూవల్ చేసుకోలేదని హోల్డ్
- రైతుబంధు, ఆసరా పింఛన్ల సొమ్ము ఇవ్వని బ్యాంకర్లు
- నిరాశగా వెనుదిరుగుతున్న రైతులు





వట్‌పల్లి ఏపీజీవీబీ బ్యాంకు

**వట్‌పల్లి(అందోల్):** పంట రుణాలు రెన్యూవల్ చేసుకోనందున బ్యాంకర్లు రైతుల ఖాతాను ఫ్రీజ్ చేశారు. ఆ ఖాతాల్లో పడిన రైతుబంధు, ఆసరా పెన్షన్లు, కల్యాణలక్ష్మి డబ్బులను సైతం తీసుకోనివ్వడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. పంటరుణాలు మాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించినా నేటికీ మాఫీ సొమ్మును బ్యాంకుల్లో జమ చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రుణమాఫీ చేయకపోగా తమ ఖాతాల్లో జమవుతున్న రైతుబంధు, రైతుబీమా, పెన్షన్ డబ్బులను తీసుకునేందుకు బ్యాంకు అధికారులు నిరాకరిస్తున్నారు.

**బ్యాంకు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు..**

బ్యాంకు రుణాలు తీర్చలేదని రైతుల ఖాతాల్లో జమ అవుతున్న రైతుబంధు, ఆసరా పెన్షన్లు, ఇతర డబ్బులను తీసుకోకుండా హోల్డ్‌లో పెట్టారు. ఈ క్రమంలో తమ డబ్బులు తీసుకోవడానికి ఎవరిని సంప్రదించాలో..ఎవరికి చెప్పుకోవాలో తెలియక రైతులు అయోమయానికి గురవుతున్నారు. బ్యాంకు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ కాళ్లా..వేళ్లా పడుతున్నా తమ బాధను పట్టించుకునే వారు కరువయ్యారని వారు వాపోతున్నారు. బ్యాంకర్ల వైఖరిపై కొందరు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్కారు సాయం తమకు అందకుండా ఎలా చేస్తారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు బ్యాంకు అధికారులు తమ జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శిస్తున్నారు. ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం రుణమాఫీ అమలు చేయకుండా రైతులను అప్పుల ఊబిలోకి నెడుతోందని ఆరోపిస్తున్నారు.

**రెన్యూవల్ చేసుకున్నా**



వానకాలం సీజన్‌కు సంబంధించి రైతుబంధు డబ్బులు ఖాతాలో జమఅవ్వగా తీసుకునేందుకు వట్‌పల్లిలోని ఏపీజీవీబీ బ్యాంకు వెళ్లాను. నా అకౌంట్ హోల్డ్‌లో పెట్టారని తెలిసింది. ఈ విషయంపై బ్యాంకు అధికారులను ప్రశ్నించగా రూ.17వేలు లోన్‌కు సంబంధించి రెన్యూవల్ చేసుకోవాలని తెలిపారు. చేసేదేమిలేక రైతుబంధు డబ్బులకు అదనంగా రూ.7,00లు కట్టి రెన్యూవల్ చేసుకున్నాను. - తుకారాం నాయక్, రైతు, మేడికుందా తండా

**రైతుబంధు ఆపొద్దని చెప్పాం**

రైతుబంధు నిధులను బ్యాంకు రుణం కింద జమ చేసుకోవడం సరైంది కాదని ఆర్‌బీఐ నిబంధనలు ఏవైనా ఉండొచ్చు కానీ రైతులకు ప్రభుత్వం సాయం చేయడంలోని ఉద్దేశాన్ని నెరవేర్చాల్సిన బాధ్యత బ్యాంకు అధికారులపై ఉంది. ఈ విషయాన్ని ఇప్పటికే పలుమార్లు బ్యాంకు మేనేజర్‌కు వివరించా. - మహేష్‌చౌహాన్, ఏఓ, వట్‌పల్లి

**హోల్డ్‌లో పెడుతున్నాం**

బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను ఏళ్లతరబడి చెల్లించకపోగా, రెన్యూవల్ కూడా చేసుకోవడం లేదు. దీంతో మొండి బకాయిలుగా పరిగణించి వారి కి నోటీసులిచ్చినా వారి నుంచి ఎటు వంటి స్పందన లేదు. దీంతో వారి ఖాతాలను హోల్డ్‌లో పెడుతున్నాం. - జనార్దన్, మేనేజర్, ఏపీజీవీబీ, వట్‌పల్లి

## తాళం వేసిన ఇంట్లో ఆభరణాల చోరీ

**హత్నూర (సంగారెడ్డి):** తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి బంగారం, వెండి ఆభరణాలను అపహరించారు. స్థానికులు, ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం..దేవులపల్లి గ్రామ శివారులోని గాంధీ నగర్‌లో మరివాడ నాయుడు సుబ్బారావు సబిత భార్యాభర్తలిద్దరూ బంధువుల ఇంట్లో తాత్కాలికంగా ఉంటున్నారు. ఇక్కడ వ్యవసాయం చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు. సబిత ఇటీవలే హైదరాబాద్‌లోని లింగంపల్లిలో ఓ ప్రైవేటు ఉద్యోగంలో కుదిరింది. దీంతో భార్యాభర్తలు ఇక్కడి నుంచి లింగంపల్లికి వెళ్లారు. భార్య అక్కడే ఉంటుండగా భర్త రోజూ గాంధీనగర్ వచ్చి వ్యవసాయ పనుల్ని చూసుకొని తిరిగి లింగంపల్లికి వెళ్తున్నాడు. కూతురుకు జ్వరం రావడంతో సుబ్బారావు అక్కడే గత రెండు రోజులుగా ఉన్నాడు. మంగళవారం సాయంత్రం గాంధీనగర్‌లోని ఇంటికి రావడంతో తాళాలు పగలగొట్టి ఉన్నాయి. దీంతో అనుమానంతో లోపలికి వెళ్లి చూడగా బీరువా తీసి ఉంది. అందులో భద్రపరిచిన బంగారం, వెండి ఆభరణాలు కనిపించలేదు. వెంటనే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

**పటాన్‌చెరు టౌన్‌లో..**

**పటాన్‌చెరు టౌన్:** తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితురాలు కథనం ప్రకారం..పటాన్‌చెరు పట్టణంలోని చైతన్య నగర్ కాలనీకి చెందిన జంగమ్మ అనే మహిళ 10వ తేదీ రాత్రి 10గంటల సమయంలో ఇంటికి తాళం వేసి అదే కాలనీలో ఉంటున్న తల్లి గారింటికి వెళ్లింది. తిరిగి మరసటి రోజు ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. అనుమానంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగలగొట్టి వస్తువులు చిందరవందరగా పడేశారు. బీరువా తెరిచి చూడగా బంగారు గొలుసు, ఐదు జతల కమ్మలు, చేతి ఉంగరాలు, ఆరు తులాల పట్టగొలుసులు, వెండి వస్తువులతో పాటు కొంత నగదు అపహరించినట్లు బాధితురాలు జంగమ్మ పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుత్ తీగ తెగిపడి వృద్ధురాలి మృతి



**నర్సాపూర్ రూరల్:** విద్యుత్ తీగ తెగిపడి వృద్ధురాలు మృతి చెందింది. ఈ సంఘటన నర్సాపూర్ మండలం అచ్చంపేటలో మంగళవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బోయిని వరమ్మ(62) గ్రామంలోని ఓ కిరాణా షాప్‌కు ఇంటి నుంచి వెళ్తున్న క్రమంలో దారి మధ్యలో వ్యవసాయ బోరు మోటర్లకు సరఫరా అయ్యే విద్యుత్ తీగ తెగి పడడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### చిన్నారిపై లైంగిక దాడి

**కొమురవెల్లి(సిద్దిపేట):** రెండేళ్ల చిన్నారిపై ఓ కామాంధుడు అత్యాచారం చేసిన ఘటన కొమురవెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్లదాస్‌నగర్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ చంద్రమోహన్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం..ఎల్లదాస్‌నగర్ చెందిన రెండేళ్ల చిన్నారి అంగన్‌వాడీ సెంటర్‌కు రోజు మాదిరిగానే మంగళవారం కూడా వెళ్లింది. సెంటర్‌కు వెళ్లిన చిన్నారిని నూనె అజయ్ బయటకు తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఉపాధిహామీ పనికి వెళ్లిన చిన్నారి తల్లి తిరిగి ఇంటి వస్తుండగా, నిందితుడి ఇంటి సమీపంలో తన కూతురిని గమనించింది. ఇంతలోనే నిందితుడు పారిపోయాడు. చిన్నారికి రక్త స్రావం కావడంతో చేర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్ చిన్నారిపై అత్యాచారం జరిగిందని చెప్పాడు. మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### కలెక్టర్‌కు ఫిర్యాదు

**హుస్నాబాద్:** హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్లు ప్రతీ రోజు విధులకు హాజరుకాకుండా వంతుల వారిగా విధులు నిర్వహించడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి హుస్నాబాద్‌కు వచ్చిన కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ కలిసి ఆయన ఫిర్యాదు చేశాడు. ఆస్పత్రికి వచ్చిన గర్భిణీలు కూర్చోవడానికి కుర్చీలు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారని తెలిపారు. గైనకాలజిస్ట్ సోమవారం, శుక్రవారం రెండు రోజులు మాత్రమే చూస్తున్నారన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న వైద్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరాడు.

### కారు పార్కింగ్ విషయంలో గొడవ

**తూప్రాన్:** కారు పార్కింగ్ విషయంలో ఇరువురి మధ్య గొడవ ఉద్రిక్తతకు దారితీసింది. ఓ వ్యక్తి తన కారును మంగళవారం రాత్రి కాలనీలో రోడ్డు పక్కన పార్కింగ్ చేసేందుకు వెళ్లాడు. అయితే రాకపోకలకు ఇబ్బంది అవుతుందని మరోచోట పార్కింగ్ చేసుకోవాలని ఆ వ్యక్తికి చెప్పాడు. దీంతో ఇద్దరి మధ్య మాటామాట పెరిగి ఉద్రిక్తతకు దారితీసింది. విషయం తెలుసుకున్న డీఎస్పీ యాదగిరిరెడ్డి పోలీస్ బలగాలతో సంఘటన స్థలానికి చేరుకొని ముందు జాగ్రత్తగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

## బస్సులో బ్యాగును మరిచిపోయిన ప్రయాణికుడు

తిరిగి అప్పగించిన ట్రాఫిక్ పోలీస్

**గజ్వేల్‌రూరల్:** ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికుడు తన బ్యాగును మరచిపోయాడు. వివరాలు ఇలా ఉన్నాయి..పంజాబ్ రాష్ట్రానికి చెందిన దీపక్‌శర్మ గోల్డ్‌టెక్ ఎక్స్‌పర్ట్ కంపెనీలో అసిస్టెంట్ సేల్స్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. తన విధుల్లో భాగంగా ట్రాక్టర్లకు సంబంధించిన విడిభాగాలు, ఇంజన్ సామాన్ల వ్యాపారం నిమిత్తం కరీంనగర్‌కు వచ్చాడు. అక్కడ పనులు ముగించుకొని సిద్దిపేటకు వచ్చేందుకు జగిత్యాల డిపోకు చెందిన బస్సు ఎక్కాడు. ఈ క్రమంలో తనవద్ద ఉన్న రెండు బ్యాగుల్లో ఒకటి డ్రైవర్ పక్కన పెట్టాడు. మరో బ్యాగును తనవద్దే ఉంచుకున్నాడు. సిద్దిపేట పాత బస్టాండ్ రావడంతో డ్రైవర్ పక్కన పెట్టిన బ్యాగును మరచిపోయి తన చేతిలో ఉన్న బ్యాగును తీసుకొని దిగిపోయాడు. బస్సు వెళ్లిపోవడంతో తన బ్యాగును మరచిపోయినట్లు గుర్తించి పక్కనే ఉన్న పోలీస్ కానిస్టేబుల్ పరమేశ్వర్‌కు సమాచారం అందజేశాడు. వెంటనే స్పందించిన కానిస్టేబుల్ ప్రజ్ఞాపూర్ చౌరస్తాలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ రఘుకు సమాచారం చేరవేశాడు.



బ్యాగును అందజేస్తున్న హెడ్ కానిస్టేబుల్ రఘు

జగిత్యాల డిపోకు చెందిన బస్సు ప్రజ్ఞాపూర్ చౌరస్తాకు చేరుకోగానే ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ రఘు అందులోని బ్యాగును తీసుకొని ప్రజ్ఞాపూర్‌కు వచ్చిన దీపక్‌శర్మకు అందజేశాడు. సకాలంలో స్పందించి తన బ్యాగ్‌ను అప్పగించినందుకు దీపక్‌శర్మ రఘుతో పాటు సిద్దిపేట పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు.

## 'జనాభా పెరుగుదలతో ఇబ్బందులు'



మాట్లాడుతున్న డాక్టర్ రజని

**సిద్దిపేటకమాన్:** భారతదేశ జనాభా 142 కోట్లకు చేరిందని ప్రపంచంలో మొదటి స్థానాన్ని ఆక్రమించిందని ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రజని తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా సిద్దిపేట డీఎంహెచ్ఓ కార్యాలయంలో వైద్యారోగ్యశాఖ సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనాభా పెరుగుదల వల్ల నిరుద్యోగం, పేదరికం, ఆర్థిక సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. జనాభా పెరుగుదలతో సంభవించే సమస్యలపై అవగహన కల్పించారు. తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. శాశ్వత కుటుంబ నియంత్రణ పద్ధతుల్లో మగవారిని ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఒకే సంతానం కలిగి శాశ్వత కుటుంబ నియంత్రణ పద్ధతులు అవలంబించిన అనంతగిరి గ్రామానికి చెందిన మౌనిక, అదేవిధంగా ఐదు సంవత్సరాల పాటు ఐయుసిడిని వేయించుకుని తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతిని పాటిస్తున్న పలువురిని అభినందించి పారితోషికం అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయరాణి, ఎన్‌సీడీ కోఆర్డినేటర్ రాజేందర్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాట్సాప్ మెసేజ్‌కి స్పందించి..

రూ.8.96లక్షలు పోగొట్టుకున్న ప్రైవేటు ఉద్యోగి

**పటాన్‌చెరుటౌన్:** గుర్తుతెలియని వ్యక్తి నుంచి వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించి ఓ ప్రైవేటు ఉద్యోగి రూ.8,96,000లు పోగొట్టుకున్నాడు. పటాన్‌చెరు పట్టణంలోని సాయిరాంనగర్ కాలనీకి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి మే11వ తేదీన తన సెల్ ఫోన్‌కు నగదు ఇన్వెస్ట్‌పై ఓ మెసేజ్ వచ్చింది. అది చూసిన బాధితుడు తన వివరాలను నమోదు చేశాడు. యూట్యూబ్‌లో లింకులు లైకులు కొట్టడం ద్వారా నగదు ఇస్తామని ఆశచూపారు. చెప్పినట్టుగానే ముందుగా బాధితుడికి రూ.150లు చెల్లించారు. అనంతరం ప్రవేటు ఉద్యోగికి రూ.9 వేలు ఇన్వెస్ట్ చేయాలని చెప్పారు. వారు చెప్పినట్టుగానే బాధితుడు ఇన్వెస్ట్ చేయడం దానికి తిరిగి రూ.11వేలు వేశారు. ఈ క్రమంలో బాధితుడు గుర్తుతెలియని వ్యక్తి చెప్పిన విధంగా పలుదఫాలుగా రూ.8.96లక్షలు నగదు ఇన్వెస్ట్ చేశాడు. తను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని బాధితుడు కోరాడు. దీంతో గుర్తు తెలియని వ్యక్తి స్పందించలేదు. బాధితుడు చేసేదేమిలేక తను మోసపోయినట్టు గుర్తించి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

**విదేశీ కరెన్సీ పేరుతో..**

**సిద్దిపేటకమాన్:** విదేశీ కరెన్సీ పేరుతో ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో గుర్తు తెలియని వ్యక్తికి డబ్బులు పంపి సైబర్ మోసానికి గురైన సంఘటన సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. సిద్దిపేట సీపీ శ్వేత తెలిపిన వివరాల ప్రకారం..ములుగు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి ఆన్‌లైన్‌లో గుర్తు తెలియని వ్యక్తి పరిచయం అయ్యాడు. తన వద్ద విదేశీ కరెన్సీ ఉందని, అదేవిధంగా భారతదేశానికి సంబంధించిన కొన్ని బహుమతులు పంపిస్తానని నమ్మించాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు గుర్తు తెలియని వ్యక్తికి ఆన్‌లైన్‌లో పలు దఫాలుగా రూ.2,48,000లు పంపించాడు. తర్వాత ఎలాంటి పార్సిల్ రాకపోవడంతో డబ్బులు పంపిన నెంబర్‌కు ఫోన్ చేయగా స్పందన లేదు. దీంతో తను మోసపోయినట్లు గుర్తించి జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు.

**త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో..**

త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి ఆన్‌లైన్‌లో పార్ట్‌టైం ఉద్యోగం ఉందనే మెసేజ్ చూసి అందులో ఉన్న లింకు ఒపెన్ చేశాడు. తన వివరాలను నమోదు చేశాడు. తక్కువ మొత్తంలో పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మబలికాడు. ఆన్‌లైన్‌లో రూ.27,780 పెట్టుబడిగా పెట్టాడు. అనంతరం మరిన్ని డబ్బులు పంపాలని మెసెజ్ రావడంతో అనుమానంతో బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు.

## తెరుచుకున్న పొరపఠన మందిరం

సాక్షి ఎఫెక్ట్



పుస్తకాలు, పేపర్లు చదువుతున్న విద్యార్థులు

**అక్కన్నపేట(హుస్నాబాద్):** ఈ నెల 10న అక్కరకురాని ›పొర పఠనం‹ శీర్షిక పేరిట సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా గంథ్రాలయ అధికారులు మండల ప్రజాపరిషత్ కార్యాలయానికి ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీఓ కొప్పుల సత్యపాల్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొరపఠన మందిరం వద్ద ఒకరిని నియమించాలని సర్క్యులర్ పంపించామన్నారు. మంగళవారం జిల్లా గ్రంథాలయం నుంచి సుమారు 120 పుస్తకాలు అందజేశారు. అదేవిధంగా పాఠశాల తరుపున సుమారు వెయ్యి పుస్తకాలు ఇచ్చినట్లు హెచ్‌ఎం మాలోతు గంగాధర్ తెలిపారు. మొత్తం 1,200పైచిలుకు పుస్తకాలు అందుబాటులో ఉంచామన్నారు. వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న నిరుద్యోగులకు కూడా ఉపయోగపడుతాయన్నారు.

## తిమ్మాపూర్ ఘటనపై జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు

**జగదేవ్‌పూర్(గజ్వేల్):** తిమ్మాపూర్ దళితులను అంటరానితనానికి గురి చేసిన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని పోలీస్ కమిషనర్ శ్వేతను జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, గ్రామ దళిత నాయకులు జాతీయ ఎస్సీ కమిషన్‌ను హైదరాబాద్‌లో కలిసి సంఘటన వివరాలతో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కమిషన్ డైరెక్టర్ స్పందించి జాతీయ ఎస్సీ కమిషన్ వైస్ చైర్మన్ అక్కడ పర్యటించి విచారిస్తారన్నారు. అనంతరం డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, దళితనాయకులు మాట్లాడుతూ దళితులపై వివక్ష చూపిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని కోరారు. తిమ్మాపూర్ ఘటనపై తగిన చర్యలు చేపట్టాలని సీపీని జాతీయ కమిషన్ డైరెక్టర్ సునీల్‌కుమార్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు నర్సింలు, కనకరాజు, అశోక్, శ్రీకాంత్, మహేందర్, కరుణకర్, కనకయ్య పాల్గొన్నారు.

**అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం**

అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించమని వివిధ కుల సంఘాల నాయకులు పేర్కొన్నారు. తిమ్మాపూర్‌లో జరిగిన కుల వివక్షపై మండలంలోని బీజీవెంకటాపురానికి చెందిన ఓ వ్యక్తి అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఈ విషయంపై ఎస్ఎఫ్ఐ, కేవీపీఎస్, ఎమ్మార్పీఎస్, మాల మహానాడు నేతలు కృష్ణమూర్తి, రాములు, శ్రీనివాస్, రాజు, కృష్ణ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ కృష్ణమూర్తికి ఫిర్యాదు చేశారు. వెంటనే ఆ వ్యక్తిపై కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు.

## స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

యూనియన్ బ్యాంకు రీజినల్ డిప్యూటీ మేనేజర్ రాఘవ



మాట్లాడుతున్న మేనేజర్ రాఘవ

**హుస్నాబాద్‌రూరల్:** గ్రామీణ మహిళలు స్వయం ఉపాధి రుణాలతో ఆర్థికంగా ఎదగాలని యూనియన్ బ్యాంకు రీజినల్ డిప్యూటీ మేనేజర్ రాఘవ అన్నారు. మంగళవారం పోతారం(ఎస్) గ్రామంలో స్వశక్తి మహిళలకు బ్యాంకు రుణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ రుణాలకు కూడా బ్యాంకు రుణం అందిస్తుందన్నారు. స్వశక్తి మహిళలు స్వయం ఉపాధి పొందే యూనిట్లు పిండి మర, కిరాణం, పాల ఉత్పత్తికి గేదెలు, గొర్రెల పెంపకం, కూరగాయల వ్యాపారం ముద్ర రుణాలను కూడా అందిస్తుందన్నారు. బ్యాంకులు అందించే రుణాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బత్తిని సాయిలు, యూనియన్ బ్యాంకు మేనేజర్ అరుణ్‌కుమార్, ఫీల్డు అధికారి సుష్మిత, సీఏ కనకతార తదితరులు పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీ



మాట్లాడుతున్న ఎస్‌ఐ సత్యనారాయణ

**రేగోడ్(మెదక్):** జగిర్యాల గ్రామంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతీ ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేసి, సరైన ధ్రువ పత్రాలు లేని 29 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలు, 2 బొలెరో వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రజల భద్రతే తమ ధ్యేయమన్నారు. ప్రతీ ఒక్కరు హెల్మెట్ ధరించి వాహనం నడపాలని, కారులో ప్రయాణిస్తున్నప్పుడు సీట్ బెల్ట్ తప్పకుండా పెట్టుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే తగు చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

**విరాళం:** గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటునకు రూ.69వేలు విరాళంగా అందజేసిన దాతను అల్లాదుర్గం సీఐ జార్జి అభినందించారు. ఈ కార్యక్రమంలో రేగోడ్, అల్లాదుర్గం, టేక్మాల్ ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## బన్నీ సేఫ్..

- బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థి అదృశ్యం కథ సుఖాంతం
- మహారాష్ట్ర నాందేడ్‌లో దొరికిన విద్యార్థి



విద్యార్థి బన్నీని తండ్రికి అప్పగిస్తున్న బాసర పోలీసులు

**తూప్రాన్:** బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థి అదృశ్యం కథ సుఖాంతమైంది. నాలుగు రోజుల ఉత్కంఠకు తెరపడింది. తమ కొడుకు క్షేమ సమాచారంతో తల్లిదండ్రుల మోములో ఆనందం పరవళ్లు తొక్కుతోంది. మెదక్ జిల్లా నర్సంపల్లికి చెందిన కత్తుల బన్నీ బాసర ట్రిపుల్ ఐటీలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇంటికి వెళుతున్నట్లు మిత్రులకు చెప్పి 6న గురువారం సాయంత్రం బాసర ట్రిపుల్ ఐటీ నుంచి వెళ్లిన బన్నీ ఆ తర్వాత ఆచూకీ తెలియకుండా పోయాడు. బాసర ట్రిపుల్ ఐటీలోనే తమ కొడుకు ఉన్నాడని భావనతో ఆదివారం తమ కొడుకు క్షేమ సమాచారం కోసం తల్లిదండ్రులు అతని నెంబర్‌కు ఫోన్ చేశారు. అది స్విచ్‌ఆఫ్ రావడంతో అతని మిత్రులకు ఫోన్‌చేసి బన్నీ కోసం ఆరా తీశారు. గురువారమే ఇంటికి వెళ్తున్నట్టు తమతో చెప్పాడని వారు పేర్కొనడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు బాసర పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీటీవీ ఫుటేజీలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసులు బన్నీ ట్రిపుల్ ఐటీ నుంచి మహారాష్ట్రలోని పూర్ణ, నాందేడ్ ప్రాంతాలకు వెళ్లినట్టు గుర్తించారు. మంగళవారం తండ్రి ఇతర కుటుంబ సభ్యులతో కలిసి పోలీసుల బృందం నాందేడ్ చేరుకొని బన్నీ ఆచూకీ కనుగొన్నారు. అనంతరం బాసర పోలీసులు కుమారుడిని తన తండ్రి వెంకటేశ్‌కు అప్పగించారు. క్షేమంగా ఇంటికి తీసుకొచ్చారు. బన్నీ మిస్సింగ్ కథ సుఖాంతం కాగా నాలుగు రోజుల టెన్షన్‌కు బ్రేకు పడింది. కొడుకు క్షేమ సమాచారంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

## ప్లకార్డులతో దంపతుల నిరసన

**సిద్దిపేటకమాన్:** కొనుగోలు చేసిన స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయాలని తమ్ముడి ఇంటి ముందు అన్న, అతడి భార్య (దంపతులు) ప్లకార్డులతో నిరసన తెలిపిన సంఘటన సిద్దిపేట పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..చేర్యాల మండలం కమలాయపల్లి గ్రామానికి చెందిన వెంకటయ్య అతని తమ్ముడైన శ్రీశైలం వద్ద 3ఎకరాలకు పైగా ఉన్న స్థలాన్ని 2011 సంవత్సరంలో కొనుగోలు ఒప్పందం చేసుకున్నారు. అందుకు అప్పట్లో రూ.5.10 లక్షలు చెల్లించామని, అప్పటి నుంచి స్థల రిజిస్ట్రేషన్‌లో జాప్యం చేస్తున్నారని ఆరోపిస్తూ వెంకటయ్య, అతని భార్య రాజవ్వతో కలిసి సిద్దిపేటలో నివాసం ఉంటున్న శ్రీశైలం ఇంటి ముందు ప్లకార్డులతో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కేసు కోర్టులో ఉందని సమాచారం.